

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL | ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం | 03-07-2026 | సంపుటి : 08 | సంచిక 22 | పేజీలు : 8 | వెల : రూ 3-00


# పదేళ్లలో ఇండియాలో 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులకు జపాన్‌తో ఒప్పందం..

120 ఒప్పందాలు.. వెల్లడించిన మోదీ



న్యూ ఢిల్లీ, ఇండియా-జపాన్ మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలు మెరుగుపడనున్నాయి. ఈ మేరకు రాబోయే పదేళ్లలో ఇరు దేశాల మధ్య 10 ట్రిలియన్ యెన్ల (దాదాపు 6 లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు భారత ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని సనాయె తకాచి ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రధాని మోదీతో ఢిల్లీలో భేటీ అయ్యారు. అక్కడి హైదరాబాద్ భవన్‌లో మోదీ, సనాయే తకైచి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య అంశాలకు సంబంధించి 120 వరకు ఒప్పందాలు కుదిరాయి.దీనిలో భాగంగా రాబోయే పదేళ్లలో రెండు దేశాల మధ్య 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులకు అవకాశం ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం జపాన్ కంపెనీలు ఇండియాలో తమ పెట్టుబడులను పెంచుకుంటాయి. ఇండియాలో పని చేస్తున్న కంపెనీలు తమ పెట్టుబడుల్ని పెంచుకుంటాయి. కొత్త కంపెనీలు కూడా వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. "ఇండియా-జపాన్ మధ్య భాగస్వామ్యం నెమ్మదిగా బలపడుతోంది. ఏడాది కాలంగా రెండు దేశాల మధ్య వ్యాపారాలకు సంబంధించి 120 ఒప్పందాలు కుదిరాయి. ఇండియాలోకి 10 బిలియన్ డాలర్ల జపాన్ పెట్టుబడులు వస్తాయి. ఈ రోజు కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మరిన్ని పెట్టుబడులకు అవకాశం ఉంది. రాబోయే పదేళ్లలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడులను ఆకర్షించడమే మా లక్ష్యం. భారత్ నిత్యం తీసుకొస్తున్న సంస్కరణలు పెట్టుబడుల్ని తీసుకొస్తున్నాయి. వ్యాపార అవకాశాల్ని వృద్ధి చేస్తున్నాయి. జపాన్ కంపెనీలు కూడా లబ్ధి పొందుతున్నాయి.జపాన్ ప్రధాని తకైచి భారత పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య అధ్యాయం మొదలవుతోంది. ఇండియా, జపాన్‌లు ప్రపంచంలోనే అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థలు. స్వేచ్ఛ, సమృద్ధి, ఇండో-పసిఫిక్ రూల్స్ ఆధారిత విధానాలు మా ప్రాధాన్యం. ఈ రోజు ఎన్నో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాం. సాంకేతిక అంశాల్లో భాగస్వామ్యం రెండుదేశాల మధ్య బలమైన సహకారానికి పునాదివేస్తుందని నేను, తకైచి నమ్ముతున్నాం" అంటూ మోదీ వ్యాఖ్యానించారు. బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వంటి వాటిలో కూడా సహకారం అందించుకుంటామని మోదీ అన్నారు.

# వీబీ -జీ రామ్ జీ పథకంతో పేదల జీవన ప్రమాణాలు పెరుగుతాయి: సీఎం చంద్రబాబు



తిరుపతి జిల్లా, జులై 2 : వికసిత్ భారత్ రోజ్‌గార్ పథకంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ పథకం ఆయా గ్రామాల ముఖచిత్రం మారుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకంతో పేదల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. ఈరోజు (గురువారం) తిరుపతి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ముక్కువారిపల్లిలో వీబీ -జీ రామ్ జీ పథకానికి శ్రీకారం చుట్టారు. సీఎం చంద్రబాబుతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. కూటమి హయాంలో ఏపీ అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్యానించారుఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. పుట్టపర్తికి ఫైటర్ జెట్ పరిశ్రమ రాబోతోందని చెప్పుకొచ్చారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని పునరుద్ఘాటించారు. జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయబోతున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి అవుతుందని స్పష్టం చేశారు. ఏడాదికి 185 రోజులు పేదవాళ్లకు ఈ పథకం పని కల్పిస్తుందని వివరించారు. దొంగ లెక్కలు రాసుకోలేని విధంగా డిజిటల్ విధానాన్ని ఈ పథకంలో అమల్లోకి తీసుకువచ్చారని అన్నారు. వీబీ -జీ రామ్ జీ పథకంలో రాష్ట్రాల వాటా 10శాతం నుంచి 40శాతం పెరిగిందని చెప్పుకొచ్చారు. కేంద్రప్రభుత్వం కొత్త ఆలోచనలు, విధానాలతో ముందుకెళ్తుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ అగ్రదేశంగా మారుతుందని వివరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఏపీలో ఓ గొడ్డలి పార్టీ ఉందని.. ఆ పార్టీ రోజుకో డ్రామా ఆడుతోందని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అమరావతికి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అంగీకరించారని.. అధికారంలోకి వచ్చాక ఆయన మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారని వ్యంగ్యంగా అన్నారు. అమరావతిని ఆపడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. వైసీపీ నేతల సంగతిని వేంకటేశ్వరస్వామి చూసుకుంటారని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

# పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు.. కేంద్ర మంత్రి ఏమన్నారంటే..

న్యూ ఢిల్లీ, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల అధిక ధరలకు కొన్న ముడి చమురునే ప్రస్తుతం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రాసెస్ చేసి



దేశీయంగా విక్రయిస్తున్నాయని అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇటీవల ముడిచమురు ధరలు పెరగడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు జూన్ 30 వరకూ దాదాపు 74 వేల కోట్ల నష్టాన్ని ఎదుర్కొన్నాయని మంత్రి చెప్పారు.ప్రస్తుతం అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్న వైనాన్ని విలేకరులు మంత్రి హర్దీప్ సింగ్ పురీ వద్ద ప్రస్తావించారు. దేశీయంగా ధరలు ఎప్పుడు తగ్గుతాయని ప్రశ్నించారు. మరో రెండు మూడు నెలల పాటు ధరలు ఇలాగే తగ్గితే అప్పటికి ఈ ప్రశ్న సమంజసమైనది అవుతుందని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పెట్రోల్ ధరలు ఇప్పటికే 20 శాతం మేర పెరిగాయని మంత్రి చెప్పారు. భారత్ పొరుగున ఉన్న దేశాల్లో కూడా ధరలు 35 శాతం వరకూ పెరిగాయని అన్నారు. భారత్‌లో మాత్రం 5.58 శాతం మేరకే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని చెప్పారు.

# నా వెంట నడిచిన వారిని ఎప్పటికీ మరిచిపోను: మంత్రి లోకేశ్

అమరావతి, జులై 2 : తన యువగళం పాదయాత్రలో వెంట నడిచిన తెలుగుదేశం కార్యకర్తలను ఎప్పటికీ మరిచిపోనని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.తిరుపతిలో జరిగిన కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను లోకేశ్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో యువగళం బృంద సభ్యులను ఆప్యాయంగా పలకరించిన ఆయన, పాదయాత్ర రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.సుమారు 15 నిమిషాల పాటు కార్యకర్తలతో లోకేశ్ ముచ్చటించారు. యువగళం విజయవంతం కావడంలో టీడీపీ



కేడర్ పాత్ర కీలకమని ప్రశంసించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎదురైన అణచివేతలు, ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొని పాదయాత్రను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. 'కార్యకర్తే అధినేత' అనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ కేడర్ సాధికారతకు నిరంతరం కృషి చేస్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా జాబ్ క్యాలెండర్ విడుదల, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, కానిస్టేబుల్ నియామకాలు వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా యువగళం ద్వారా ఏర్పడిన బంధం శాశ్వతమని, కార్యకర్తలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, యువగళం పాదయాత్రతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# అమరావతిపై జగన్ మరో డ్రామా..

## రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: సోమిరెడ్డి

విజయవాడ, జూలై 2,అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మావిగన్' పేరుతో మరో కొత్త నినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు.అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు.అమరావతి కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి త్యాగాలు చేశారని సోమిరెడ్డి అన్నారు. ప్రస్తుతం రూ.57,821 కోట్ల విలువైన 97 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి కేవలం నగరం కాదని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అని చెప్పారు.




# సంపాదకీయం

శుక్రవారం 03-07-2026

## అటు మణిపూర్..ఇటు బెంగాల్

మణిపూర్ సమస్య గత మూడేళ్లుగా జాతీయ చర్చల్లో ముందు వరుసలో ఉంది. మీడియా దానిని విస్తృతంగా కవర్ చేసి, కేంద్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని దోషిగా చూపించేందుకు అనేక కోణాల నుంచి ప్రచారం చేసింది. అయితే ఇప్పుడు ఆ ప్రస్తావన దాదాపు మాయమైంది. ఇది యాదృచ్ఛికం కాదు. భద్రతా దళాలు నిరంతరంగా ఉగ్రవాద ఏరివేత కార్యకలాపాలు నిర్వహిస్తుంటే, మీడియా ఆ సాధనలను నిశ్శబ్దంగా వదిలేసింది. ఇది మీడియా కవరేజ్‌లో ఉన్న ఎంపికాత్మక విధానాన్ని స్పష్టం చేస్తుంది. మొదట్లో మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలు, జాతి ఉద్రిక్తతలు, స్థానభ్రంశం చెందిన కుటుంబాల కథనాలు రోజూ మీడియాలో నిండి ఉండేవి. కేంద్ర ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోలేదని, శాంతి ప్రక్రియ విఫలమైందని విమర్శలు వెల్లువెత్తాయి. ఇది రాజకీయ వ్యూహంగా మారి, ప్రభుత్వాన్ని దోషిగా చూపించేందుకు ఉపయోగపడింది. ఇప్పుడు పరిస్థితి మారింది. భద్రతా దళాలు సమర్థవంతంగా పని చేస్తున్నప్పటికీ, ఆ వార్తలు ప్రధాన మీడియాలో కనిపించడం లేదు. ఇది "వార్తలు ఎప్పుడు ముఖ్యం అవుతాయి?" అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. హింస తగ్గినప్పుడు లేదా ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకున్నప్పుడు కవరేజ్ తగ్గడం సాధారణం కాదు. ఇది మీడియా యొక్క ఎంపికాత్మక విధానాన్ని, రాజకీయ వ్యూహాలను ప్రతిబింబిస్తుంది. మణిపూర్‌లో ఉగ్రవాద ఏరివేత పూర్తి స్థాయిలో కొనసాగుతోంది. ఇటీవల మణిపూర్ పోలీస్, కేంద్ర సాయుధ బలగాలు (సీఆర్పీఎఫ్, కోబ్రా, ఆర్ఏఎఫ్, అస్సాం రైఫిల్స్) కలిసి ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, కాక్చింగ్, బిష్ణుపూర్ తదితర ప్రాంతాల్లో ఉగ్రవాదుల హైడౌట్లపై దాడులు, శోధన కార్యకలాపాలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 86 ఆయుధాలు, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు, యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇది ఉగ్రవాదుల సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీసే చర్య. ఇటువంటి ఆపరేషన్లు కేవలం ఒక్కసారి కాక, నిరంతరంగా జరుగుతున్నాయి. ఇవి రాష్ట్రంలో శాంతి, భద్రతను పునరుద్ధరించేందుకు కీలకం. ఇంతటి సాధనలు ఉన్నప్పటికీ మీడియా దృష్టి మరలలేదు. ఉగ్రవాదులు ఇంకా మణిపూర్ వాసులను భయపెట్టడం, అశాంతి సృష్టించడం కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా కుకీ సముదాయం మీద దాడులు, బెదిరింపులు నివేదించబడుతున్నాయి. ఇది రాష్ట్రంలోని సాధారణ ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఉగ్రవాదులు ఆయుధాలు, పేలుడు పదార్థాలు దాచి ఉంచడం, దాడులు చేయడం ద్వారా శాంతి ప్రక్రియకు అడ్డంకి కలిగిస్తున్నారు. భద్రతా దళాలు ఈ ముప్పును తట్టుకోవడానికి, ఉగ్రవాదులను నిర్మూలించడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. కానీ ఇది ఒక్కటే సరిపోదు. రాజకీయ సంవాదం, సమన్వయం కూడా అవసరం. మణిపూర్ సమస్య మూలాలు జాతి ఉద్రిక్తతలు, భూమి, ఎస్టీ హోదా వంటి సమస్యలలో ఉన్నాయి. రెండు వర్గాల మధ్య హింస జరిగింది. దీనిలో ఉగ్రవాద సంస్థలు రెండు వైపుల నుంచి కూడా పాల్గొన్నాయి. కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాలను మోహరించి, ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా పరిస్థితిని నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవలి ఆయుధ స్వాధీనాలు ఈ ప్రయత్నాల సాఫల్యాన్ని చూపుతున్నాయి. మరోవైపు, మీడియా ప్రారంభంలో హింసను, ప్రభుత్వ వైఫల్యాలను హైలైట్ చేసింది. ఇప్పుడు భద్రతా దళాల సాధనలు, ఉగ్రవాదులపై ఏరివేతలు జరుగుతున్నప్పటికీ నిశ్శబ్దం పాటిస్తోంది. నిజమైన శాంతి కోసం భద్రతా చర్యలతో పాటు రాజకీయ పరిష్కారం, ఇరు వర్గాల మధ్య విశ్వాసం పెంపు అవసరం. మణిపూర్‌లో శాంతి సాధించడం సులభం కాదు. కానీ భద్రతా దళాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. మరో వైపు శ్చిమ బెంగాల్‌లో మే నెలలో బాధ్యతలు స్వీకరించిన సువేందు అధికారి రెండు నెలల్లోనే సరిహద్దు భద్రత, చొరబాటుదారుల సమస్యపై దృష్టి సారించారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఒక సంక్లిష్ట సమస్య పరిష్కారానికి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చే అక్రమ వలసలను అరికట్టడం, ఇప్పటికే ఉన్నవారిని గుర్తించి తరలించడం ఈ చర్యల్లో ముఖ్యాంశాలు. బంగ్లాదేశ్ సరిహద్దులో బీఎస్ఎఫ్ బలగాలు బలోపేతం చేయడం, 50 కిలోమీటర్ల పరిధిలో వారికి మరిన్ని అధికారాలు ఇవ్వడం, అవసరమైతే కాల్పులకు అనుమతి ఇవ్వడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో బంగ్లాదేశ్ బార్డర్ గార్డ్స్ నుంచి వచ్చే ప్రయత్నాలను బీఎస్ఎఫ్ సమర్థవంతంగా అడ్డుకుంటోంది. ప్రభుత్వ వాదన ప్రకారం చొరబాట్లు గణనీయంగా తగ్గాయి. అదనంగా బీఎస్ఎఫ్‌కు 142 ఎకరాల భూమి కేటాయించడం, ఫెన్సింగ్ పనులు ప్రారంభించడం వంటి అంశాలు సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేస్తున్నాయి. త్రిపురలో ఇప్పటికే ఫెన్సింగ్ జరుగుతుండగా, బెంగాల్‌లో కూడా ఇలాంటి చర్యలు వేగవంతం అవుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా ఈ సమస్యపై సడలింపు చూపిందని, అధికారులు కూడా నిర్లక్ష్యం చేశారని విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఈ విధానం మారింది. సంక్షేమ పథకాలు నిజమైన పౌరులకు మాత్రమే అందేలా చూస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించే నెట్‌వర్క్‌లను ఛేదించడం, ఉగ్రవాద సంబంధాలను గుర్తించడం వంటి చర్యలు కూడా భాగం. ఈ చర్యలు సరిహద్దు రాష్ట్రాలలో భద్రతను మెరుగుపరచడానికి, వనరులను స్థానికులకు మళ్లించడానికి ఉద్దేశించినవి. అస్సాం, త్రిపురలో ఇప్పటికే ఇలాంటి ఏరివేతలు జరుగుతున్న నేపథ్యంలో బెంగాల్‌లో కూడా వేగం పుంజుకుంది.

## వరద కాల్వ ద్వారా ఆయకట్టు గ్రామాల చెరువులు నింపాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్ : నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని వరద కాల్వ మరమ్మతు పనులు పూర్తి అయినందున వరద కాలువను రివర్స్ పంపింగ్ ద్వారా నింపి ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఈఈ లాల్ సింగ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఇటీవల దెబ్బతిన్న వరద కాల్వ మరమ్మతు పనులు పూర్తి అయినందున సబ్ కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న చిన్నపాటి వివాదం వల్ల పనులు నెమ్మదించినట్లు ఇరిగేషన్ ఈఈ ఎమ్మెల్యే దృష్టికి



తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రి తక్షణమే ఇరు వర్గాల కాంట్రా క్టర్లతో మాట్లాడి, ఒకట్రెండు రోజుల్లో వివాదాన్ని పూర్తిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా పనులకు ఎలాంటి ఆటంకం కలగకూడదని, అవసరమైతే తాను కూడా స్వయంగా ప్రధాన కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. వరద కాల్వపై ఏర్పాటు చేసిన తూముల ద్వారా నియోజకవర్గంలోని కాలువ పరిధి గ్రామాల చెరువులు నింపడానికి, ఆయా గ్రామాల రైతాంగానికి సాగునీరు అందించడానికి ఈ వరద కాల్వే ఏకైక ఆధారమని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 15.2 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఎగువన ఉన్న బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి 14 గేట్లు ఎత్తి 5.2 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఈఈ లాల్ సింగ్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఎస్సారెస్పీ నుంచి గానీ లేదా కింది నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా గానీ వరద కాల్వను పూర్తిగా నింపి, ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి సాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## సీనియర్ నేత మనీశ తివారీని పక్కన పెట్టిన కాంగ్రెస్!

వచ్చే ఏడాది ఎన్నికలకు సిద్ధం అవుతున్న పంజాబ్ కాంగ్రెస్ ఈ దిశగా కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల కమిటీల బాధ్యతలను పలువురు నేతలకు అప్పగించింది. అయితే, సీనియర్ నేత, ఎంపీ మనీశ్ తివారీకి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడం రాష్ట్రంలో చర్చకు దారి తీసింది. ఈ విషయంపై మనీశ్ తివారీ ఎక్స్ వేదికగా తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.'అసలు నైపుణ్యాలు ఉండటమే ఒక పెద్ద తప్పు లాగా ఉంది. జనాల అభద్రతా భావాలను తొలగించే మార్గం నాకు తెలిసుంటే బాగుండేది. కాంగ్రెస్ నాకు గత 45 ఏళ్లల్లో ఎన్నో అవకాశాలు ఇచ్చింది. నేనూ నా జీవితాన్ని పార్టీకి అంకితం చేశాను. కానీ జీవితంలో ఏది రాసిపెట్టి ఉందో అదే జరుగుతుంది' అని ఆయన ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. అయితే, మనీశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న చండీగఢ్ రాష్ట్రం పరిధిలోకి




రాకపోవడంతో ఆయనకు ఎన్నికల బృందంలో చోటు దక్కలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. తివారీ గతంలో లూథియానా, ఆనంద్‌పూర్ లోక్‌సభ స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు. ఇక గురువారం కాంగ్రెస్ పలు ఎన్నికల కమిటీలకు ఛైర్‌పర్సన్‌లను ప్రకటించింది. ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్స్‌ను కూడా నియమించింది. తివారీకి మాత్రం ఎలాంటి ఎన్నికల బాధ్యతలు దక్కలేదు. ఇక, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమరీందర్ సింగ్‌ను కొనసాగించడంపై చరణజీత్ సింగ్ ఛన్నీ వంటి సీనియర్ నేతలు పలువురు అసంతృప్తితో ఉన్నట్టు కూడా తెలుస్తోంది. ఈసారి ఎన్నికల ప్రచార కమిటీకి చరణ్‌జీత్ సింగ్ ఛన్నీ నేతృత్వం వహిస్తున్నారు. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ కోఆర్డినేషన్ కమిటీకి విజయ్ ఇందర్ సింఘ్లా నాయకత్వం వహిస్తున్నారు.

## విరాళాల వివాదంలో కీలక పరిణామం..

### చంపత్ రాయ్‌పై పోలీసులకు ఫిర్యాదు..

అయోధ్య నిధుల దుర్వినియోగం వ్యవహారంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్? జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్? రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. జూన్ 27వ తేదీన ఆయన తన రాజీనామాను సమర్పించారు. చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా రాజీనామా సమర్పించారు. విరాళాల దుర్వినియోగం వివాదంలో నైతిక బాధ్యత వహిస్తూ ఈ ఇద్దరు నేతలు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. చంపత్ రాయ్?పై 'ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఫైజాబాద్' లాయర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయోధ్య జిల్లాలోని రామజన్మ భూమి పోలీస్ స్టేషన్‌లో చంపత్ రాయ్‌తో పాటు అనిల్ మిశ్రా, కృష్ణ దేవ్, గోపాల్ రావ్‌లపై కూడా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా



ఫైజాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాళికా శరణ్ మిశ్రా మీడియాతో మాట్లాడారు. ' పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాము. ఐదుగురు వ్యక్తులు ఫిర్యాదు హార్డ్ కాపీ తీసుకోవడానికి స్టేషన్‌లోకి వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు కాపీ ఇవ్వకపోతే ఆందోళన కొనసాగిస్తాము. రామ్ మందిర్ విషయంలో నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు భరోసా ఇచ్చారు' అని తెలిపారు. కాగా, విరాళాల లెక్కింపులో అవినీతి జరిగిందంటూ సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ జూన్ 7వ తేదీన సంచలన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే యూపీ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. జూన్ 25వ తేదీన పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. విరాళాల లెక్కింపు ప్రక్రియతో సంబంధం ఉన్న 8 మంది ఉద్యోగులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా చంపత్ రాయ్ స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు అధికారులు రికార్డ్ చేశారు. ఇక, జులై 6వ తేదీన అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అత్యవసర సమావేశం నిర్వహించనుంది. 2/3 వంతు మెజారిటీతో చంపత్ రాయ్, అనిల్ మిశ్రాల భవితవ్యంపై ట్రస్ట్ నిర్ణయం తీసుకోనుంది. సిట్ సిఫార్సుల మేరకు ట్రస్ట్ మేనేజ్‌మెంట్‌లో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి.

## ప్రభుత్వం కూలుతుందన్న డీఎంకే ప్రచారాన్ని కొట్టిపారేసిన తమిళనాడు సీఎం విజయ్

చెన్నై, జూలై 2: తమిళనాడులో రాజకీయ సమీకరణాలు, ప్రభుత్వంపై వస్తున్న ఊహాగానాలకు తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ గట్టి సమాధానమిచ్చారు. చెన్నైలో నిర్వహించిన మిత్రపక్షాల ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని, కూటమి నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూలిపోతుందంటూ ప్రతిపక్షాలు, కొన్ని వర్గాలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని, ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రభుత్వం పూర్తి కాలం విజయవంతంగా కొనసాగుతుందని సీఎం విజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాజకీయంగా తమను దెబ్బతీయాలని చూసే వారి వ్యూహాలు ఫలించవని స్పష్టం చేశారు. ప్రభుత్వ పనితీరు, కూటమి గమనంపై మాట్లాడిన ముఖ్యమంత్రి, తమ ప్రయాణంలో రెండు ప్రధాన సూత్రాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయకుండా, పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ, లౌకికవాద విలువలను కాపాడతామని చెప్పారు. 'అవినీతిరహిత పాలన, లౌకికవాదం అనేవి మా ప్రభుత్వానికి రెండు కళ్లు. ఈ రెండు కీలక అంశాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదు' అని విజయ్ స్పష్టం చేశారు. కూటమిలోని భాగస్వామ్య పక్షాలన్నీ మరింత సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు. మిత్రపక్షాలన్నీ ఐక్యంగా ఉంటూ, కేవలం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. రాజకీయ విమర్శలను పక్కనబెట్టి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే అందరి ముందున్న ఏకైక లక్ష్యం కావాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.

## కేతన్‌ను లోయలోకి ఎవరు తోశారో ఆధారాల్లేవు..

### లైడిటెక్టర్ పరీక్షకు కోర్టు అనుమతి కోరిన పోలీసులు



పుణే రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితురాలు సియా గోయల్ (కు లై డిటెక్టర్ పరీక్ష నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. కేతన్‌ను లోయలోకి తోసింది ఎవరో నిర్ధారించే ప్రత్యక్ష సాక్ష్యాలు తమ దగ్గర లేవని కోర్టుకు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా దర్యాప్తునకు ఉపయోగపడే కొత్త సమాచారం లభించే అవకాశం ఉందని చెప్పారు. సియా గోయల్, చేతన్ చౌదరి వాంగ్మూలాలు ఇప్పటికే నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. అయితే వాటితోనే కేసును నిర్ధారించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. అందుకే పాలిగ్రాఫ్ పరీక్ష అవసరమని కోర్టుకు విన్నవించారు. ఈ పరీక్ష ఫలితాలు కోర్టులో ప్రత్యక్ష సాక్ష్యాలుగా పరిగణించకపోయినా దర్యాప్తునకు కొత్త ఆధారాలు సేకరించేందుకు ఉపయోగపడతాయని పోలీసులు వెల్లడించారు. కాగా జూన్ 18న లోహగడ్ కోట వద్ద కేతన్ హత్య జరిగింది. ఈ హత్య తర్వాత కొంతసేపు కేతన్ మొబైల్ సియా వద్దే ఉందని గుర్తించారు. ఆ సమయంలో అందులోని కీలక సమాచారం తొలగించారా అనే కోణంలో ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఘటనను పోలీసులు రీక్రియేట్ చేశారు. సియా, చేతన్ ఇద్దరూ జులై 3 వరకు పోలీసుల కస్టడీలో ఉండనున్నారు.

## సిక్కు మైనార్టీలను పాక్ రక్షించడం లేదు: బీజేపీ మాల్వీయా




న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లోని ఫరూకాబాద్‌లో ఉన్న 125 ఏళ్ల క్రితం నాటి చరిత్రాత్మక శ్రీ గురు సింగ్ సాహెబ్ సాహిబ్ గురుద్వారాను కూల్చిన విషయం తెలిసిందే. ఆ ఘటన పట్ల బీజేపీ స్పందించింది. సిక్కు మైనార్టీలకు పాకిస్థాన్ రక్షణ కల్పించడంలో విఫలమైనట్లు పేర్కొన్నది. బీజేపీ నేత అమిత్ మాల్వీయా తన ఎక్స్ అకౌంట్‌లో రియాక్ట్ అయ్యారు. ఇది కేవలం విధ్వంసం మాత్రమే కాదు అని, వ్యవస్థీకృత నిర్లక్ష్యమని.. పాకిస్థాన్‌లో ఉన్న సిక్కు వారసత్వ గుర్తులను కావాలనే ధ్వంసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పాకిస్థాన్ కపట వైఖరిని విస్మరించలేమన్నారు. పాకిస్థానీ ఏజెన్సీలు స్థానిక స్కికులను భారత్‌పైకి రెచ్చగొడుతున్నాయని, మరో వైపు సిక్కు చరిత్ర, విశ్వాసం, గుర్తింపు ఆనవాళ్లను తుడిచి వేసే ప్రక్రియలో పాకిస్థాన్ ఉన్నట్లు ఆరోపించారు. పాకిస్థాన్ అనుసరిస్తున్న కుటిల్ ఎజెండా అందరికీ తెలుసు అని, సిక్కు మతస్తుల విశ్వాసాలు, వారసత్వాన్ని, హక్కులను కాపాడేది ఎవరో వారికి తెలుసు అన్నారు. పాకిస్థాన్‌తో పాటు ఆ ఆదేశానికి మద్దతు ఇస్తున్న భారత వ్యవస్థలు రాజకీయం నిర్వీర్యం అవుతాయని, పాక్ చేపట్టిన చర్య ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీ సందేశం వెళ్తుందని భావిస్తున్నట్లు మాల్వీయా వెల్లడించారుపంజాబ్ ప్రావిన్సులోని ఫరూకాబాద్‌లో ఉన్న చరిత్రాత్మక గురుద్వారాను స్థానిక వ్యాపారి కూల్చివేశాడు. దీంతో సిక్కు వర్గ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ నుంచి ఎన్వోసీ లేకుండానే ఆ వ్యాపారి గురుద్వారాను కూల్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్ సీఎం మరియం నవాజ్ దీనిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సింగ్ సాహెబ్ గురుద్వారాను తక్షణమే మరమ్మత్తు చేయాలని పంజాబ్ మైనార్టీల శాఖ మంత్రి రమేశ్ సింగ్ అరోరా తెలిపారు.

## 'ప్రతి ఎకరాకు జియో ట్యాగింగ్'

### చండూరు ఏఓ మల్లేష్

చండూరు, జులై 02 : ప్రతి ఎకరాకు జియో టాగినీగ్ చేయనున్నట్లు చండూరు మండల వ్యవసాయ అధికారి మల్లేష్ తెలిపారు. చండూరు మండలంలోని బంగారిగడ్డ రైతు వేదిక నందు గురువారం గ్రామ సర్పంచ్ బోయపల్లి సునీత అధ్యక్షతన నిర్వహించిన కాటన్ కపాస్ కాంతి పథకం కింద వచ్చిన పత్తి విత్తనాలను (అధిక సాంద్రత పత్తి) రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఈ పథకం కింద వచ్చిన విత్తనాలను



రైతులు కచ్చితంగా విత్తుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే విత్తనాలు నాటిన రైతులు తీసుకోవడానికి అవకాశం లేదని, అధిక సాంద్రత పత్తి ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత ఏఈఓలను సంప్రదించి తమ ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం, రైతు వాంగ్మూలం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్క రైతుకి/ కుటుంబానికి ఒక ఎకరానికి మాత్రమే విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని తర్వాత విత్తనాలు తీసుకున్న రైతుల పంట క్షేత్రాలలో అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. దీనికి జియో టాగింగ్ చేయడం జరుగుతుంది కావున రైతులు ఇది గమనించి కచ్చితంగా విత్తనాలు నాటుకునే రైతులు మాత్రమే తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భూతరాజు ఆంజనేయులు, తలారి నరసింహ, ధోనిపాముల, బోడంగిపర్తి సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# జడ శ్రావణ్ తో జాగ్రత్త పడుతున్న జగన్!



విజయవాడ, జూలై 2 ఏపీ రాజకీయాల్లో కుల ప్రభావం అధికంగా ఉంటుంది. కులాల వారీగా ఓట్లు చీలిపోతాయి కూడా. అలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం అండ ఉంటుంది. మరోవైపు దళిత క్రైస్తవ ఓటర్లు కూడా అటువైపే మొగ్గు చూపుతారు. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. కానీ దళిత క్రైస్తవులు మాత్రం ఆ పార్టీని ఆదరించారు. అయితే ఆ ఓటు బ్యాంకు పై తాజాగా గురి పెట్టారు జడ శ్రవణ్ కుమార్. గోదావరి జిల్లాలో దళిత క్రైస్తవ సభ పెట్టి.. మీరంతా జడ శ్రావణ్ తాలూకా అని చెప్పే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ మాదిరిగా ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అవుతానని కూడా తేల్చి చెప్పారు. పనిలో పనిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై కూడా సున్నిత విమర్శలు చేశారు. దీంతో ఆ పార్టీలో అంతర్మథనం ప్రారంభం అయ్యింది.కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు జడ శ్రావణ్ కుమార్ సేవలను వాడుకోవాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. సాక్షి మీడియాలో ఆయన ప్రెస్మీట్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు ప్రభుత్వాన్ని ఇరుక్కున పెట్టేలా జడ శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు నడిచేవి. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ ను ఒక అస్త్రంగా మార్చుకోవాలని చూసింది. కానీ ఇప్పుడు అదే జడ శ్రవణ్ నేరుగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత కీలకమైన దళిత క్రైస్తవ ఓటు బ్యాంకుకే ఎసరు పెట్టేలా ఉన్నారు. ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభ. కానీ వైసీపీని ఉలిక్కిపడేలా చేసేసారు శ్రావణ్ కుమార్. ఆకివీడు ఘటన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు క్రైస్తవ మతాన్ని కించపరిచారని ప్రధాన అజెండాతో ఈ సభ నడిచింది. రఘురామకృష్ణం రాజును తీవ్రస్థాయిలో టార్గెట్ చేసిన జడ శ్రావణ్ కుమార్ ఈ సభ ద్వారా దళిత క్రైస్తవులను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. తనను తాను అభినవ అంబేద్కర్ గా చూపించే ప్రయత్నం చేశారు. కేవలం వేదికలపై ఉపన్యాసాలకే పరిమితం కాకుండా.. ఇకపై రాష్ట్రంలోని దళిత క్రైస్తవులంతా పాము జడ శ్రావణ్ తాలూకా అని గర్వంగా చెప్పుకోవాలి అంటూ ఇచ్చిన పిలుపు వైసిపిలో సంచలనంగా మారుతుంది. ఆ పార్టీ నేతలు ఇప్పుడు శ్రావణ్ కుమార్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ ఓటు బ్యాంకు పైనే గురి పెడతారా అని ప్రశ్నిస్తున్నారు. తాము మీడియా మైలేజ్ ఇస్తూ.. పరోక్షంగా పాలు పోసి పెంచిన జడ శ్రావణ్.. ఇప్పుడు సొంత సామాజిక వర్గాలను చీల్చే ప్రయత్నం చేస్తుండడం పై వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. జడ శ్రావణ్ కుమార్ నేరుగా ఈసారి తాను ఉప ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. అయితే అది ఎలా సాధ్యమో తెలియడం లేదు. కానీ అనవసరంగా జడ శ్రవణ్ కుమార్ ను హైలెట్ చేశామని వైసిపి నేతలు బాధపడుతున్నారు. ఇప్పుడు ఈ అంశంతో కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఉంది పరిస్థితి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక వస్తే ఆ పార్టీకి దారుణ పరాజయం తప్పదు.. జడ శ్రావణ్ నిజంగా దళిత క్రైస్తవ ఓట్లను టార్గెట్ చేసుకుంటే ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లకు గండి పడవచ్చు వైసీపీకి. కూటమిని దెబ్బతీయడానికి వాడిన అస్త్రం ఇప్పుడు రివర్స్ తిరిగి జగన్ సొంత సామ్రాజ్యాన్ని దెబ్బతీసేలా ఉంది.

# ఆ 10 మంది ఎమ్మెల్యేలపై టీడీపీ సైలెంట్ యాక్షన్

విజయవాడ, జూలై 2 ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. అధికార తెలుగుదేశం పార్టీ లో అంతర్గత క్రమశిక్షణపై ఆ పార్టీ హైకమాండ్ అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తోంది. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఉత్సాహంలో కొందరు ఎమ్మెల్యేలు రూట్ మారుస్తూ, పార్టీ గీసిన లక్ష్మణ రేఖను దాటుతుండటంపై అధినేత నారా చంద్రబాబు నాయుడు సీరియస్ యాక్షన్‌కు దిగినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వివాదాస్పద వ్యాఖ్యలు, సొంత క్యాడర్‌తో విభేదాలు, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న కొందరు శాసనసభ్యులను హెచ్చరించడం మానేసి.. నేరుగా దూరం పెట్టే వ్యూహాన్ని టీడీపీ అమలు చేస్తోంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మొదటి నుండి తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన పార్టీ హైకమాండ్ నిర్ణయాలను బహిరంగంగానే ధిక్కరిస్తూ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. పార్టీ అధిష్ఠానం పలుమార్లు అంతర్గతంగా హెచ్చరించినప్పటికీ ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. దీంతో టీడీపీ అగ్రనాయకత్వం ఆయనను పూర్తిగా పక్కనబెట్టేసింది. ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణను ఇప్పటికే ఇతర నేతలు చూస్తున్నారు. ఆయనను కేవలం పేరుకే ఎమ్మెల్యే అన్నట్లుగా మార్చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా ఇదే గతి పడుతుందనేందుకు కొలికపూడి ఎపిసోడ్ ఒక ఉదాహరణగా నిలిచింది.మరోవైపు సత్యవేడు ఎమ్మెల్యే కోనేరు ఆదిమూలం ప్రవర్తన కూడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. మహిళతో వివాదాస్పదంగా ప్రవర్తించి వార్తాల్లోకి ఎక్కిన ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ వివాదం సెటిల్ చేసుకున్నా ఆయనను పార్టీలో కలుపుకోలేదు. అందుకే ఆయన కుమారుడు ఇటీవల ప్రెస్మీట్ పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.అయినా టీడీపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. సత్యవేడులో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న పాత కార్యకర్తలు సైతం ఆయనను ఓన్ చేసుకోవడం లేదు. ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా, సోషల్ మీడియా ఫీడ్‌బ్యాక్ ద్వారా గ్రహించిన చంద్రబాబు.. సత్యవేడులో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే పనులు జరిగేలా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. తద్వారా క్యాడర్‌ను కాపాడుకుంటూనే, ఎమ్మెల్యేకు గట్టి షాక్ ఇచ్చారు. వలం ఈ ఇద్దరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది మందికి పైగా ఎమ్మెల్యేల జాబితాను పార్టీ ఇంటెలిజెన్స్ వింగ్ సిద్ధం చేసింది. అధికారం అండతో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, ఇసుక, భూ దందాల్లో తలదూర్చడం, కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగించకుండా వివాదాలు కొనితెచ్చుకోవడం వంటి నెగెటివ్ రిపోర్ట్స్ ఉన్న నేతలందరినీ ఈ లిస్టులో చేర్చారు. వీరిలో కొందరు ఉత్తరాంధ్ర, మరికొందరు రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నట్లుగా చెబుతున్నారు. గతంలో 2014-19 మధ్య కాలంలో కొందరు ఎమ్మెల్యేల మితిమీరిన ప్రవర్తన వల్లే పార్టీ 23 సీట్లకు పడిపోయిందనే చేదు నిజాన్ని చంద్రబాబు నాయుడు ఎప్పటికీ మర్చిపోలేదు. అందుకే, ఈసారి 135 కి పైగా సీట్ల భారీ మెజారిటీ ఉండటంతో.. ఒకరిద్దరు లేదా పది మంది ఎమ్మెల్యేలు దూరమైనా ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదనే ధీమాతో హైకమాండ్ ఉంది. వ్యవస్థ ముఖ్యం, ప్రజల్లో పార్టీ ఇమేజ్ ముఖ్యం.. అంతేకానీ దారి తప్పిన ఎమ్మెల్యేల కోసం పార్టీ ప్రతిష్టను పణంగా పెట్టలేం అని లోకేష్, చంద్రబాబు ఇద్దరూ అంతర్గత సమావేశాల్లో తెగేసి చెప్పారు. మారమని హెచ్చరించడం కంటే, వారిని పక్కనబెట్టి ప్రత్యామ్నాయ నేతలను తయారు చేయడం ద్వారా సదరు ఎమ్మెల్యేల పొగరు దించే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.టీడీపీ హైకమాండ్ తీసుకుంటున్న ఈ నిశ్శబ్ద అడుగులు.. సదరు వివాదాస్పద ఎమ్మెల్యేలకు భవిష్యత్తుపై పెద్ద హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం వీరిని దూరం పెట్టడం అంటే.. వచ్చే ఎన్నికల్లో వీరికి టికెట్లు దక్కే ప్రసక్తే లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపడమే. సోషల్ మీడియాలో కూడా ఈ ఐసోలేషన్ స్ట్రాటజీపై సామాన్య కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు తప్పు చేస్తే వెనకేసుకొచ్చే పాత రోజులు పోయాయని, పద్ధతి మార్చుకోకపోతే ఎంతటి సీనియర్ అయినా మాజీ అవ్వక తప్పదని టీడీపీ పంపుతున్న ఈ స్ట్రాంగ్ మెసేజ్.. మిగిలిన ఎమ్మెల్యేలను కూడా దారిలోకి తెస్తుందని భావిస్తున్నారు.

# వైసీపీ బలమైన స్థానాలే టార్గెట్...

విశాఖపట్టణం, జూలై 2అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోటీ రోజురోజుకు మరింత ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా వచ్చే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పార్టీ తమ బలహీన, బలమైన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గంగా భావించే అరకు ఇప్పుడు జనసేన పార్టీ వ్యూహాల్లో కీలక స్థానం సంపాదించిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.అరకు ప్రాంతంలో గత కొన్నేళ్లుగా వైసీపీకి బలమైన మద్దతు ఉంది. గిరిజన ఓటర్లలో ఆ పార్టీకి మంచి పట్టుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో తన బలాన్ని పెంచుకోవాలని జనసేన భావిస్తున్నట్లు సమాచారం. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఆ పార్టీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అరకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం పొందుతోంది. కూటమి రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గంలో బలమైన నిర్మాణం అవసరమని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే స్థానిక కార్యకర్తలను మరింత చురుకుగా పనిచేయాలని సూచనలు ఇస్తున్నారని చెబుతున్నారుఅరకు పార్లమెంట్ పరిధిలో గిరిజన సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలు ఎప్పుడూ ప్రధాన చర్చగా ఉంటాయి. ఈ సమస్యల పరిష్కారంపై ప్రజల్లో విశ్వాసం కల్పించగలిగితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని జనసేన అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా తమ ప్రభావాన్ని పెంచుకోవాలని పార్టీ ప్రయత్నాలు చేస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఇక వైసీపీ కూడా తన బలమైన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో లభించిన మద్దతును కొనసాగించేందుకు స్థానిక నాయకులు ప్రజలతో మరింత మమేకం అవుతున్నారని సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తమ ఆధిక్యాన్ని కొనసాగించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.రానున్న ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అరకు రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు కూటమి వ్యూహాలు కూడా ఈ ప్రాంత ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తే అరకు నియోజకవర్గంలో పోటీ గతంతో పోలిస్తే మరింత ఉత్కంఠభరితంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.అయితే అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, ఎన్నికల నాటికి మారే రాజకీయ పరిస్థితులు కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశాలుగా ఉంటాయి. అందుకే ఇప్పటి నుంచే అన్ని పార్టీలు తమ తమ వ్యూహాలను అమలు చేస్తూ ప్రజల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అరకు వంటి కీలక ప్రాంతాల్లో రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో రానున్న రోజుల్లో అక్కడి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# శంకుస్థాపనలతో సరా..19 ఏళ్లలో మూడోసారి

కడప, జూలై 2 వైఎస్సార్ కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. జూలై 3న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, 2007 నుంచి ఇప్పటివరకు వరుసగా వచ్చిన ముఖ్యమంత్రులంతా శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేస్తూనే ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై రాయలసీమ వాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి వేయబోయే పునాది రాయి అయినా ప్రాజెక్టు పూర్తికి దారితీస్తుందా.. లేక గత చరిత్ర పునరావృతమవుతుందా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కానీ, విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా.. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం చేతులెత్తేయడంతో, రాష్ట్ర ప్రభుత్వమే ఈ భారీ ప్రాజెక్టును మోయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతోంది.కడప స్టీల్ ప్లాంట్ చరిత్రను గమనిస్తే.. ఇదొక శంకుస్థాపనల రికార్డుగా నిలిచిపోతుంది. 2007లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జమ్మలమడుగు వద్ద మొదటిసారి శంకుస్థాపన చేశారు. అది ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సున్నిపెంట వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిన వెంటనే 2019 డిసెంబర్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌కు మూడోసారి పునాది రాయి వేశారు.ఆయా కంపెనీల బోర్డులు మారడం, శంకుస్థాపనల శిలాఫలకాలు పడటమే తప్ప ప్రాజెక్టు మాత్రం అంగుళం కూడా ముందుకు కదల్లేదు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ప్రతిపక్షాలు మరియు ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలోకి వచ్చే ప్రైవేట్ స్టీల్ ప్రాజెక్టులకు మరియు ఇతర పారిశ్రామిక దిగ్గజాలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, విద్యుత్, నీటి రాయితీలను గుమ్మరిస్తున్న పాలకులు.. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కడప స్టీల్ ప్లాంట్‌కు మాత్రం నిధులు కేటాయించడంలో వెనుకాడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు జూలై 3న జరగబోయే శంకుస్థాపన అయినా రాయలసీమ నిరుద్యోగుల ఆశలను నిజం చేస్తుందో, లేక కేవలం ఎన్నికల, రాజకీయ ప్రచార అస్త్రంగానే మిగిలిపోతుందో కాలమే సమాధానం చెప్పాలి.

# పెద్దిరెడ్డి, చెవిరెడ్డిలతో నెగ్గేదెలా

తిరుపతి,జూలై 2,వైసీపీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ బలం పుంజుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ల మధ్య పెద్ద వైరం నడుస్తున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతల మధ్య ఇప్పుడు విభేదాలు పతాక స్థాయికి చేరినట్లు టాక్ నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డి ఆ ఇద్దరు నేతల విషయంలో ఎటు తేల్చుకోలేకపోతున్నట్లు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు అంటేనే ముందుగా గుర్తొచ్చేది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. మొన్నటి ఎన్నికల్లో ఆ జిల్లా నుంచి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు గెలిచారు. అదే సమయంలో రోజాతో పాటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి లాంటి వారు ఓడిపోయారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి మాట నడిచేది చిత్తూరు జిల్లాలో. రాయలసీమలో సైతం ఆయన హవా ఉండేది. అటువంటిది ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత.. పెద్దిరెడ్డి కి వ్యతిరేకంగా చెవిరెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారంలో ఉంది.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి హవా అంతా ఇంతా కాదు. ఏకంగా కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడించేందుకు ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు. అదే సమయంలో సొంత పార్టీ వారు సైతం ఆయన కనుసన్నల్లో ఉండాల్సిందే. లేకుంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పేవి కావు. అందుకే అప్పట్లో ఆర్కే రోజాతో పాటు చెవిరెడ్డి లాంటివారు పెద్దిరెడ్డి విషయంలో చాలా గౌరవభావంతో ఉండేవారు. దానికి ప్రధాన కారణం భయం. అయితే ఇప్పుడు వైసీపీ ఓడిపోయిన తర్వాత పెద్దిరెడ్డి విషయంలో వైసీపీ నేతల తీరు మారింది.ప్రధానంగా ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తీవ్రంగా విభేదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్దిరెడ్డి రాయలసీమను చూసేవారు. ఆయన కుమారుడు మిథున్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి వెంట నిత్యం తాడేపల్లి కార్యాలయంలోనే ఉండేవారు. కానీ ఇప్పుడు మద్యం కుంభకోణం కేసు పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి విషయంలో పెద్దిరెడ్డి వైఖరి మారినట్లు ప్రచారంలో ఉంది. అదే సమయంలో తాడేపల్లి లో చేరారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. పెద్దిరెడ్డి ఫ్యామిలీ విషయంలో జగన్ చెవిరెడ్డి ఇస్తున్న సమాచారాన్ని నమ్ముతున్నారని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం సాగుతోంది. దీంతో ఆ ఇద్దరు నేతల మధ్య విభేదాలు పతాక స్థాయికి చేరాయని.. ఆ ఇద్దరు నేతలను సర్ది చెప్పలేక జగన్మోహన్ రెడ్డి బాధపడుతున్నట్లు ప్రచారంలో ఉంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# నవంబర్ లో సీఐఐ సదస్సు

విశాఖపట్టణం, జూలై 2 ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త పంథాను ఎంచుకుంది. వచ్చే నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఈ సదస్సును గతానికి భిన్నంగా, వినూత్నంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈసారి భాగస్వామ్య సదస్సు కేవలం విశాఖపట్నానికే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎంఓయూలు , పెట్టుబడుల సంతకాలే ధ్యేయం కాకుండా.. అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని పంచుకోవడం మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఈ సదస్సుల ద్వారా యువతలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించాలని, టెక్నాలజీ రంగంలో గ్లోబల్ ఛాంపియన్లుగా ఎదిగేలా గైడెన్స్ ఇవ్వాలని సూచించారు. విదేశీ ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులలో స్టార్టప్ కంపెనీలకు, సరికొత్త ఆవిష్కరణలకు అగ్రతాంబూలం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆలోచనలకు ఈ వేదికలు ఊతమివ్వాలని.. నేటి తరం యువత భాగస్వామ్యాన్ని ఇందులో భారీగా పెంచాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో భారీగా రోడ్ షోలు నిర్వహించనున్నారు. దేశీయంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి నగరాల్లో రోడ్ షోలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాల పరిశ్రమలకు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయో ముందే బేరీజు వేసుకుని.. ఆయా ప్రాంతీయ సదస్సులలోనే నిర్దిష్టమైన ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే, అమరావతిలో 'సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు.పారిశ్రామిక ప్రగతితో పాటు పబ్లిక్ పాలసీలు, భవిష్యత్ ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఈ సదస్సులో కీలక చర్చలు జరగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కేవలం పరిశ్రమలే కాకుండా వ్యవసాయం, ఉద్యానవన రంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ మరియు నేటి కార్పొరేట్ ప్రపంచానికి అవసరమైన 'స్ట్రెస్ ఫ్రీ వర్క్' వంటి వినూత్న అంశాలపై గ్లోబల్ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీల ప్రొఫెసర్లు చర్చించేలా ప్లాన్ చేయాలన్నారు.

### ఈనెల 14 వరకు తెలంగాణ జర్నలిస్టు కేవీఆర్‌కు రిమాండ్

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో తెలంగాణ జర్నలిస్టు కేవీఆర్ ) కు బొబ్బిలి కోర్టు ఈనెల 14వ తేదీ వరకు రిమాండ్ విధించింది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బాడంగి పోలీసులు కేవీఆర్( కె వెంకటరామిరెడ్డి) ని అరెస్టు చేసి ఏపీలోని విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.గురువారం బొబ్బిలి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో బొబ్బిలి జైలుకుతరలించారు.భారతరాజ్యాంగం, ఏపీ నాయకులపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని కేవీఆర్‌పై విజయనగరం జిల్లా బాడంగి మాజీ సర్పంచ్ కండి రమేష్ ఏప్రిల్ 10న బాడంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఓటు నమోదు తప్పనిసరి--

**అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు--**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02:ఓటు నమోదు ప్రతి పౌరుడి బాధ్యత అని నంద్యాల అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరుకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశారని తెలిపారు.ఓటర్లు తమకు అందిన ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా తిరిగి అందజేయాలని సూచించారు. అనంతరం వాటిని మ్యాపింగ్ ప్రక్రియలో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు వివరాల ధృవీకరణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో పాటు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి కూడా ఏర్పడవచ్చని హెచ్చరించారు.అందువల్ల 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటికే ఓటు ఉన్నవారు కూడా తమ వివరాలను సరిచూసుకుని ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో సమర్పించాలని అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# న్యాయవాదుల పరిరక్షణ చట్టానికి ప్రభుత్వం సానుకూలం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02-ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు మంత్రిని కలిసి న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమలులో ఉన్న న్యాయవాదుల పరిరక్షణ చట్టాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే త్వరలో హైకోర్టును సందర్శించి న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, ఉద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సీఆర్డీఏ పాస్‌లు, న్యాయవాద గుమస్తాలకు బస్ పాస్‌ల అంశాలపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కిరణ్, జాయింట్ సెక్రటరీ వల్లభనేని శాంతిశ్రీ, ట్రెజరర్ సుధారాణి, కార్యవర్గ సభ్యులు శ్రీలక్ష్మి, అరుణ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గంగిశెట్టి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల జీఓ రద్దు చేయాలి--

**స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ వినతిపత్రం-**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 02-నంద్యాలలో దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ గోపాల్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు కోసం జారీ చేసిన జీఓ



ఎంఎస్ నెం.396ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా నాయకులు రమేష్, ఫారుక్, మాలిక్, విశ్వనాథం, శివరాం మాట్లాడుతూ సేవా కేంద్రాల వల్ల ప్రజల ఆస్తుల భద్రతకు భంగం కలిగే అవకాశముందని, దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్ల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో భాగంగా నంద్యాల జిల్లాలోనూ శాంతియుత ఆందోళనలు ప్రారంభించినట్లు తెలిపారు. జీఓను రద్దు చేసి రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# విబిజీ రాంజీతో పేదలకు మెరుగైన జీవనోపాధి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 2: విబిజీ రాంజీ కార్యక్రమం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. పాణ్యం మండల మార్కెట్ యార్డులో గురువారం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి విబిజీ రాంజీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే ఈ పథకం లక్ష్యమన్నారు. నంద్యాల జిల్లాలో సుమారు 2.50 లక్షల మంది ఉపాధి కూలీలు రోడ్ల నిర్మాణం, పొలాల గట్లు, వాగుల శుభ్రత, చెక్‌డ్యాంల అభివృద్ధి వంటి పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. దీంతో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి మేలు జరుగుతోందన్నారు.ఈ పథకం కింద ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



గ్రామసభల ద్వారా ప్రజలు సూచించిన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చి అమలు చేస్తున్నామని చెప్పారు.ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, విబిజీ రాంజీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతమవుతున్నాయని అన్నారు. గ్రామసభల్లో ప్రజలు ప్రతిపాదించిన పనులను నిబంధనల ప్రకారం ఆమోదించి చేపడుతున్నట్లు తెలిపారు. నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసిన ఉపాధి కూలీలకు రూ.312 వేతనం అందజేస్తున్నామని చెప్పారు.అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే మార్కెట్ యార్డు ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ సూర్యనారాయణ, గ్రౌండ్‌వాటర్ డీడీ రఘురాం, అధికారులు, సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ మళ్లీ అరెస్టు!

**2025 నాటి కేసులో చర్యలు!**

విజయవాడ, జూలై 2ఈ మధ్య కాలంలో జరిగిన దళిత క్రైస్తవ సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆయనకు అర్ధరాత్రి బెయిల్ మంజూరు అయ్యింది. అయితే ఆయన్ని అరెస్టు చేసినప్పటి నుంచి మెజిస్ట్రేట్ వద్దకు తీసుకెళ్లే వరకు పిఠాపురంలో హైడ్రామా సాగింది. చివరకు అర్ధరాత్రి బెయిల్ వచ్చింది. అయితే వెంటనే మరో కేసులో అరెస్టు చేస్తున్నట్టు పోలీసులు ఆయనకు, ఆయన తరఫున లాయర్‌కు తెలియజేశారు. రావణ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు పిఠాపురం జగ్గయ్య చెరువు వద్ద ఉన్న న్యాయమూర్తుల బంగ్లాకు తీసుకువెళ్లి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. సుమారు రెండు గంటల పాటు బెయిల్‌పై వాదనలు జరిగాయి. నిందితుడు తరపున జడ శ్రవణ్ వాదనలు వినిపించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి వ్యక్తిగత పూచీపై బెయిల్ గ్రాంట్ చేశారు. అంతకు ముందు పిఠాపురం పోలీస్ స్టేషన్‌లో హైడ్రామా నడిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన జోసఫ్ ఎలియాస్ ప్రశ్న రావణ్‌ను అప్పగించాలని పెద్ద ఎత్తున జనసైనికులు స్టేషన్‌ను చుట్టుముట్టారు. అప్పటికే ఆయన అరెస్టు సమాచారం అందుకున్న దళిత క్రైస్తవ సంఘాలు అక్కడకు చేరుకున్నారు. వారు ఆయనకు రక్షణగా నిలిచారు. దీంతో పిఠాపురంలో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. అయితే పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి మరింత హీటెక్కకుండానే నిరసనకారులను అక్కడి నుంచి పోలీసులు తీసుకెళ్లిపోయారు. అయినా కొందరు అక్కడే నినాదాలు చేస్తూ ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో నాటకీయపరిణామాల మధ్య రావణ్‌ను పోలీసులు సైలెంట్‌గా మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అర్ధరాత్రి వరకు సాగిన వాదనల తర్వాత ఆయనకు న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. అయితే ఇలా బెయిల్ వచ్చిందో లేదో మరో కేసులో రావణ్‌ను పోలీసులు అరెస్టు చేస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది సర్పవరం పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని సర్పవరం తరలించారు. దీన్ని ఆయన తరపున వాదిస్తున్న శ్రవణ్ ఖండించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రిపై ఎలాంటి తప్పుడు కామెంట్స్ చేయలేదని, గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను మాత్రమే గుర్తు చేశారని అన్నారు. ఈ మధ్య కాలంలో నేతలు చేస్తున్న కామెంట్స్‌పై చర్యలు తీసుకోకుండా ప్రశ్నిస్తున్న గొంతుకలను నొక్కేందుకు మాత్రమే అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. జూన్ 28న జరిగిన దళిత క్రైస్తవ సమర శంఖారావంలో రావణ్ శృతిమించి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాధా మనోహర్‌దాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఎందుకు చేయాల్సి వచ్చింది, ఎవరైనా చేయిస్తున్నారా అనే కోణంలో పోలీసులు ప్రశ్నించారు. దీనికి సంబంధించిన వివరాలు రాబడుతున్నారు. ఆయనకు వచ్చే ఆదాయ వనరులను పరిశీలిస్తున్నారు.

# విబి జీ రామ్ జి అభివృద్ధి పథంలో నూతన అధ్యాయం

**వికసిత భారత్ - 2047 కలలకు సాకరం**

**రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) పథకం పల్లెసీమల ప్రగతికి గొప్పవరం**

గుంటూరువికసిత భారత్?గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) (విబి జీ రామ్ జి ) అమలు అభివృద్ధి పథంలో ఒక నూతన అధ్యాయం అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. విబి జీ రామ్ జి కార్యక్రమాన్ని పెదకాకాని మండలం ఉపాలపాడులో గురువారం లాంఛనంగా భూమి పూజ చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విబి జీ రామ్ జి పథకంతో పల్లెలు వికసించనున్నాయని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం ఇప్పటి వరకు కొనసాగిందని తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేక భవనాలు, కాలువలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాల్లో నూతన అంశాలను జోడిస్తూ మరింత చక్కగా అభివృద్ధికి తోడ్పడే విధంగా విబి జీ రామ్ జి పథకాన్ని తీసుకురావడం జరిగిందని చెప్పారు. వికసిత భారత్ -2047, స్వర్ణ ఆంధ్రా - వికసిత ఆంధ్రప్రదేశ్ కలలను సాకరం చేసేందుకు దీన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. రెండు వందల బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 సంవత్సరం నాటికి 2.40 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చేయుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. పల్లెసీమల ప్రగతికి విబి జీ రామ్ జిగొప్పవరం అని, ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హత గల గ్రామీణ కుటుంబానికి సంవత్సరంలో 125 రోజులు పని కల్పించుటకు చట్ట బద్ధమైన హామీని ఇస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శారీరక శ్రమ చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి కుటుంబానికి 125 రోజులు పాటు ఉపాధి కల్పిస్తారని, వ్యవసాయ పనులు సమయంలో ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ముందుస్తు ప్రకటన ద్వారా 60 రోజులు పాటు పనులను తాత్కాలికంగా నిలిపివేసే వెసులుబాటు ఉంటుందని అన్నారు. మిగిలిన 305 రోజుల్లో 125 రోజులు ఉపాధి హామీ అందుబాటులో ఉంటుందని అన్నారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం దీనిలో ఒక ముఖ్యమైన భాగం అని, సాంకేతికత, పారదర్శకత కోసం సోషల్ ఆడిట్‌ను, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. కొత్త చట్టం ద్వారా గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే (వికసిత్ భారత్ 2047) లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, గ్రామాల ఆస్తులు సృష్టి జరుగుతుందని అన్నారు. గ్రామీణ మహిళలు, యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు.

# మహానందిలో నేడు ప్రజా వేదిక--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జులై 2: జిల్లా పరిపాలన చేపట్టిన “వన్ మంత్?ఫోర్ విజిట్” కార్యక్రమంలో భాగంగా జులై 3న మహానంది మండలంలోని కమ్మ సత్రం హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు.



అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొని సమస్యలను పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నారు.మహానంది మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలు, వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గోమాత సేవకు హైదరాబాద్ భక్తుడి విశిష్ట కానుక---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 2:గోమాతల సంరక్షణకు భక్తి, సేవాభావానికి నిదర్శనంగా హైదరాబాద్‌కు చెందిన భక్తుడు వేమవరపు వెంకట రవికుమార్ మహానంది శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానం గోశాలలోని గోవుల సంక్షేమం కోసం ఐదు వాల్‌మౌంట్ ఫ్యాన్లను భక్తిశ్రద్ధలతో విరాళంగా సమర్పించారు.వేసవి, ఉక్కపోత సమయంలో గోశాలలోని గోవులకు చల్లని వాతావరణం కల్పించేందుకు ఈ ఫ్యాన్లు ఉపయోగపడనున్నాయి. భక్తుడి ఈ సేవాభావాన్ని దేవస్థానం అధికారులు, గోశాల సిబ్బంది అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.గోసేవ మహాదానమనే భావనతో ముందుకు వచ్చి గోశాల అభివృద్ధికి చేయూతనిచ్చిన వేమవరపు వెంకట రవికుమార్ సేవ ఇతర భక్తులకు ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. దేవస్థానం అభివృద్ధి, గోశాల సంక్షేమానికి భక్తులు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

# స్వర్ణాంధ్రపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జూలై 2: స్వర్ణాంధ్ర?2047 లక్ష్యాలతో “ఎకనామిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్” అంశంపై తిరుపతిలో నిర్వహించిన రెండు రోజుల రాష్ట్రస్థాయి నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించి పాల్గొన్నారు.

# నేడు మండల కేంద్రంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం... తహసిల్దార్ రవి

**పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ.**

తుగ్గలి: నేడు మండల కేంద్రమైన తుగ్గలి నందు నిర్వహించు పిజిఆర్ఎస్ కార్యక్రమానికి కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం రోజున ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం పక్కన,ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక భాగం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు.కావున శుక్రవారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలియజేశారు.కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రవి ప్రజలకు తెలియజేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**